క్లుప్తంగా

ఎంపీడీఓ లావణ్యకు స్త్రీ శక్తి పురస్కారం



ఎంపీడీఓ లావణ్యకు పురస్కారం అందజేస్తున్న చీకూరి లీలావతి తదితరులు

హుజూర్‌నగర్‌రూరల్ : హుజూర్‌నగర్ ఎంపీడీఓ పిండిప్రోలు లావణ్యకు స్త్రీ శక్తి పురస్కారం లభించింది. విధుల్లో భాగంగా ఆమె పేదలకు ఉత్తమ సేవలందించినందుకు గాను బుధవారం హుజూర్‌నగర్ మండల పరిషత్ కార్యాలయంలో విన్నపం ఒక పోరాటం స్వచ్ఛంద సంస్థ, సావిత్రిబాయి పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ లావణ్యకు విన్నపం ఒక పోరాట సంస్థ రాష్ట్ర అధ్యక్షురాలు చీకూరి లీలావతి పురస్కారం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో సీడీపీఓ వెంకటలక్ష్మి, ఏపీఓ శైలజ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న మహేష్‌గౌడ్

మఠంపల్లి : శ్రీరామనవమిని పురస్కరించుకొని మఠంపల్లి మండల కేంద్రంలోని మాంట్‌ఫోర్టు ఉన్నత పాఠశాలలో స్థానిక ముదిరాజ్ యూత్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను బీసీ సంఘం జిల్లా నాయకుడు వల్లపుదాస్ మహేష్‌గౌడ్ బుధవారం రాత్రి ప్రారంభించారు. వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 20 జట్లు ఈ పోటీల్లో తలపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గాదె జయభారత్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, ముదిరాజ్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం కమిటీ ఎన్నిక

గరిడేపల్లి : మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ అనుబంధ సంఘం) 6వ మహాసభ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా జాయింట్ సెక్రటరీ సుధాకర్‌రెడ్డి సమక్షంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా బెజ్జం రమేష్, ఉపాధ్యక్షుడిగా నందిపాటి వినోద్, ప్రధాన కార్యదర్శిగా నెమిలి వీరయ్య, సహాయ కార్యదర్శి ఆనంద్‌రావు, కోశాధికారిగా పిట్ట శ్రీను, గౌరవ అధ్యక్షుడిగా ఎడవెల్లి వెంకటేశ్వర్లు, గౌరవ సలహాదారులు ఎస్‌కె పెద్దమస్తాన్, మాచర్ల రవి, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

మిషన్ భగీరథ నీటి సరఫరా నాలుగు రోజులు బంద్

హుజూర్‌నగర్ : నియోజకవర్గ పరిధిలోని మట్టపల్లిలో గల మిషన్ భగీరథ ఇన్‌టేక్ వెల్ వద్ద నీటి పంపింగ్ సామర్థ్యాన్ని పెంచే పనులు జరుగుతున్నందున మిషన్ భగీరథ తాగు నీటి సరఫరాలో నాలుగు రోజులు అంతరాయం కలుగుతుందని డీఈఈ అభినయ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మట్టపల్లి నీటి శుద్ధి కేంద్రం పరిధిలోని మొత్తం 75 గ్రామాలకు 3వ తేదీ నుంచి 6వ తేదీ వరకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

మంద కృష్ణమాదిగ సభను జయప్రదం చేయాలి

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ నియోజవర్గం చింతలపాలెం మండలం గుడిమల్కాపురంలో ఈనెల 11న పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పాల్గొనే సభను విజయవంతం చేయాలని ప్రజా సంఘాలు, ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు కోరారు. ఈమేరకు బుధవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లాలో పర్యటన కరపత్రాన్ని వారు ఆవిష్కరించి మాట్లాడారు. గుడిమల్కాపురంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణ, బహిరంగ సభకు మంద కృష్ణ మాదిగ వస్తున్నారని తెలిపారు. సంఘాల నాయకులు బి.ప్రసాద్, ఆర్.ప్రభాకర్, విశాఖ, జి.వెంకటేశ్వర్లు, సీహెచ్.నాగయ్య, ఎం.కిరణ్‌కుమార్, జి.బాబు, ప్రశాంత్, ప్రభు, వెంకటేశ్వర్లు, నాగరాజు, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరలు పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న సతీష్‌కుమార్

గరిడేపల్లి : సమాజ సేవ చేసే స్వచ్ఛంద సంస్థలకు ప్రతిఒక్కరూ తమవంతు సహకారం అందించాలని గ్రేటర్ వాసవి క్లబ్ అధ్యక్షుడు గెల్లి సతీష్‌కుమార్ కోరారు. వాసవి క్లబ్ రీజినల్ చైర్మన్ బెలిద భరత్ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో వాసవి, వనిత క్లబ్ ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వనిత క్లబ్ అధ్యక్షురాలు గెల్లి పుష్పలత, వాసవి క్లబ్ ప్రధాన కార్యదర్శి ఇలీంద్ర సురేష్, ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తాటికొండ లక్ష్మణ్, శ్రీరంగం ప్రసాద్, కందిబండ కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

నడిగూడెం : మండలంలోని రామాపురం, చాకిరాల, సిరిపురం గ్రామాల వద్ద సాగర్ ఎడమ కాల్వ కట్టపై విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. రైతులు వ్యవసాయ మోటార్ల కోసం ఈ విద్యుత్ తీగలు ఏర్పాటు చేసుకున్నారు. కానీ తీగలు తక్కువ ఎత్తులో చేతులకు అందేవిధంగా, పలు చోట్ల దెబ్బతిని ఉన్నాయి. ఈ కాల్వ కట్టమీదుగా నిత్యం అనేక మంది ప్రజలు, రైతులు రాకపోకలు కొనసాగిస్తుంటారు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కావున సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



సాగర్‌కాల్వ కట్టపై రామాపురం సమీపాన వేలాడుతున్న విద్యుత్ తీగలు

గూనలు పగిలి.. గుంతలుగా మారి

మోతె : మండలంలోని రావిపహాడ్ – బొప్పారం గ్రామాల మధ్య రావిపహాడ్ గ్రామ శివారులో కల్వర్టు గూనలు పగిలాయి. దీంతో కల్వర్టుపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా ఉన్నాయి. గత ఏడాదిగా దారిలో గుంతలు ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. రాత్రి వేళ ఈ మార్గంలో రాకపోకలు సాగించే రైతులు ప్రమాదాల భారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.



కల్వర్టుపై ఏర్పడిన గుంతలు

విద్యార్థులు రచనలపై ఆసక్తి పెంచుకోవాలి

● జూలూరు గౌరీశంకర్



జ్ఞాపకాల హరివిల్లు పుస్తకం ఆవిష్కరిస్తున్న గౌరీశంకర్ తదితరులు

కోదాడ : విద్యార్థి దశ నుంచే రచనలపై ఆసక్తి పెంచుకోవాలని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. కోదాడ పట్టణ పరిధిలోని తేజ విద్యాలయానికి చెందిన పదవ తరగతి విద్యార్థులు రూపొందించిన 'జ్ఞాపకాల హరివిల్లు'పుస్తకాన్ని బుధవారం ఆయన పాఠశాలలో ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థుల మదిలో వచ్చిన ఆలోచనలను పుస్తక రూపంలో తీసుకురావడం మంచి పరిణామమని, ఇదే ఒరవడి తెలంగాణలోని అన్ని పాఠశాలల్లో రావాలని ఆకాంక్షించారు. పిల్లల్లో సాహిత్యాభిరుచి పెరగడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఉస్తెల రమాదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సోమిరెడ్డి, పుప్పాల కృష్ణమూర్తి, వేముల వెంకటేశ్వర్లు, కేపీబీవీ కుమార్, నాగుబండి రంగా, జాఫర్, చందా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముగిసిన పదవ తరగతి పరీక్షలు

నేరేడుచర్ల : పదవ తరగతి పరీక్షలు ముగిసాయి. బుధవారం నేరేడుచర్లలో విద్యార్థులు కేరింతలు కొడుతూ పరీక్ష కేంద్రం వద్ద బయటకు వచ్చారు. పరీక్ష కేంద్రాల వద్ద సందడిగా కనిపించారు. కాగా, గత నెల 21వ తేదీ నుంచి ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు ఈ నెల 2వ తేదీతో ముగిశాయి.

సంక్షేమంలో మరో ముందడుగు



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమంలో మరో ముందడుగు వేసిందని మున్సిపల్ మాజీ చైర్మన్ గెల్లి అర్చన రవి, టీపీసీసీ జాయింట్ సెక్రెటరీ అజీజ్ పాషా అన్నారు. రేషన్ కార్డుదారులకు ఉచిత సన్నబియ్యం పథకం అమలు చేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చిత్రపటానికి బుధవారం హుజూర్‌నగర్‌లో పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఎ.సతీష్, కాంగ్రెస్ నాయకులు ఎస్.సుబ్బారాజు, పి.రామరాజు, జె.సైదులు, వై.పిచ్చయ్య, రామ్మూర్తి, భాస్కర్, యూసుఫ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభం, స్వామివార్ల విగ్రహాలకు అభిషేకం



ధ్వజస్తంభానికి అభిషేకం చేస్తున్న భక్తులు

నేరేడుచర్ల : మండలంలోని మేడారం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో బుధవారం రెండవ రోజు విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు ఇరువంటి నరేంద్ర శర్మ, రేవూరి శివకుమార్‌శర్మ, ఇరువంటి వెంకటరమణశర్మ, సత్యనారాయణశర్మ, జన్నాబట్ల కిశోర్ శర్మ ఆధ్వర్యంలో ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా ధ్వజస్తంభానికి భక్తులు పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పానుగోటి భుజంగరావు, కార్యదర్శి అరిబండి శ్రీరామయ్య, కోశాధికారి రామారావు, కట్ట శ్రీనివాస్‌రావు, అరిబండి సురేష్, చిన సీతయ్య, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

సొమ్ము కేంద్రానిది.. సోకు కాంగ్రెస్‌ది

● బీజేపీ జిల్లా అధ్యక్షురాలు శ్రీలతారెడ్డి



నేరేడుచర్లలో సన్నబియ్యం పంపిణీని పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి

నేరేడుచర్ల : లబ్ధిదారులకు అందజేసే సన్నబియ్యంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చేది ఐదు కిలోలైతే రాష్ట్ర ప్రభుత్వం ఒక్క కిలో మాత్రమే ఇస్తుందని, కానీ సన్నబియ్యం పథకం విషయంలో సొమ్ము కేంద్ర ప్రభుత్వానిది.. సోకు కాంగ్రెస్‌దిలా మారిందని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి అన్నారు. బుధవారం నేరేడుచర్లలోని పలు రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీని ఆమె పరిశీలించి మాట్లాడారు. సన్నబియ్యం పంపిణీలో కేంద్ర ప్రభుత్వ వాటా కేజీకి రూ.40 అయితే రాష్ట్ర ప్రభుత్వ వాటా కేవలం రూ.10 మాత్రమేనని, అయినా రేషన్ షాపుల వద్ద కనీసం ప్రధాన మంత్రి ఫొటో కూడా పెట్టకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తూ పబ్బం గడుపుతుందన్నారు. ఆమె వెంట బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొణతం నాగిరెడ్డి, పార్టీ పాలకీడు మండల అధ్యక్షులు నర్రినాయక్, జిల్లా కన్వీనర్ సంకల మద్ది సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర నాయకులు బాల వెంకటేశ్వర్లు, తాళ్ల నరేందర్‌రెడ్డి, తాళ్లూరి రమేష్, అంబటి నాగేశ్వర్‌రావు, నారాయణరెడ్డి, రాజేష్‌రెడ్డి, దేవిరెడ్డి నాగిరెడ్డి, అశోక్, సైదులు తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యంలో కేంద్ర ప్రభుత్వ వాటా ఉంది

హుజూర్‌నగర్ : రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యంలో కేంద్ర ప్రభుత్వ వాటా కూడా ఉందని బీజేపీ జిల్లా కార్యదర్శి కొండ హరీష్‌గౌడ్ అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని రేషన్ షాపును ఆయన సందర్శించి సన్న బియ్యాన్ని పరిశీలించి మాట్లాడారు. బీజేపీ నాయకులు జి.గోపి, ఎం.లక్ష్మణ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు.. సర్వాయి పాపన్నగౌడ్



చిలుకూరులో పాపన్నగౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు



గరిడేపల్లి : సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గౌడ కులస్తులు

చిలుకూరు : సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆదర్శప్రాయుడని జై గౌడ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సురగాని లింగయ్యగౌడ్ అన్నారు. బుధవారం చిలకూరు మండల కేంద్రంలోని బాపూజీ శాఖా గ్రంథాలయంలో జై గౌడ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కడియాల వెంకటేశ్వర్లు, గౌడ ఉపాధ్యాయ సంఘం నాయకులు బంధం వెంకటేశ్వర్లు, గుండు ఆదినారాయణ, కొండా ధనమూర్తి, కొండా రామాంజినేయులు, కొండా వెంకటేశ్వర్లు, గౌడ సంఘం నాయకులు అమరగాని కాశయ్య, శేషయ్య, వీరబాబు, నరేష్, నాగేందర్ గ్రామపెద్దలు, పాల్గొన్నారు.

బహుజన పోరాటయోధుడు పాపన్నగౌడ్

గరిడేపల్లి : బహుజన పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని పొనుగోడు గ్రామ గౌడ యువత అన్నారు. బుధవారం పొనుగోడులో పాపన్నగౌడ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాపన్నగౌడ్ పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో గౌడ సంక్షేమ సంఘం యూత్ నియోజకవర్గ అధ్యక్షుడు అనంతు కర్ణాకర్ గౌడ్, బత్తిని రాంబాబు, చామకూరి అంజి, బండి విజయ్, హుస్సేన్, సుధాకర్, ఆంజనేయులు, శోభన్, అంజి, మధు, మహేష్, గురుస్వామి, సతీష్, వీరబాబు, పవన్, నాగరాజు, భరత్, అంజయ్య, రవల్, బుద్ధయ్య, సతీష్ పాల్గొన్నారు.

హెచ్‌సీయూ భూములను కాపాడాలి



హుజూర్‌నగర్‌లో రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు

హుజూర్‌నగర్ : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూములను కాపాడాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పల్లె వెంకటరెడ్డి అన్నారు. యూనివర్సిటీ భూముల కోసం పోరాటం చేస్తున్న విద్యార్థి నాయకులను అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ బుధవారం హుజూర్‌నగర్ పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ తీసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ హయాంలో యూనివర్సిటీకి ఇచ్చిన 400 ఎకరాల భూములకు వేరే వారికి కట్టబెట్టడం సరైంది కాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు దుగ్గి బ్రహ్మం, శీలం శ్రీను, ఎలక సోమయ్య, పి.వెంకటనారాయణ, యోనా, మురళి, వీరమల్లు, వీరయ్య, వెంకటి, శ్రీను, వేణు, శంభయ్య, తిరుపయ్య, గోవిందు తదితరులు ఉన్నారు.

కేసులు ఎత్తివేయాలి

పాలకవీడు : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను విక్రయించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి అనంతప్రకాష్ కోరారు. హెచ్‌సీయూ భూముల విక్రయంపై ఆందోళన చేసిన ప్రజా సంఘాల నాయకులపై పెట్టిన కేసులు తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పాలకవీడు తహసీల్దార్ కమలాకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పగడాల మట్టేష్, ఆర్లపూడి వీరభద్రం, నన్నెపంగు రమేష్, పరంగి కృష, తదితరులు పాల్గొన్నారు.

మోతెలో సీపీఎం ర్యాలీ..

మోతె : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలాన్ని ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మట్టిపెల్లి సైదులు కోరారు. ఈమేరకు బుధవారం మోతె మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భూములు విక్రయించడంపై ప్రశ్నించిన విద్యార్థులు, సీపీఎం నాయకులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కమిటీ సభ్యుడు గుంటగాని ఏసు, సోమగాని మల్లయ్య, కోడి లింగయ్య, బానోతు పాప, ఒగ్గు సైదులు, బానోతు లచ్చిరాం, చెరుకు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మేళ్లచెరువులో నిరసన

మేళ్లచెరువు : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను విక్రయించే నిర్ణయాన్ని విరమించుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో నిరసన తెలిపారు. మండల కార్యదర్శి వట్టెపు సైదులు, గుండు సైదులు, మేడిపల్లి అశోక్, శ్రీను, నర్సింహరావు, నరేష్, సాంబయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

మత రాజకీయాలతో పబ్బం గడుపుతున్న బీజేపీ

నేరేడుచర్ల : మత రాజకీయాలతో బీజేపీ పబ్బం గడుపుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి విమర్శించారు. బుధవారం నేరేడుచర్లలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేదల కడుపు నింపేందుకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీదని అన్నారు. పేదలకు ఇస్తున్న సన్న బియ్యం పంపిణీని రాజకీయం చేయడం తగదన్నారు. కేంద్రం నుంచి 5 కేజీలు ఇస్తున్నామని చెప్పే బీజేపీ.. ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో సన్న బియ్యం ఇస్తుందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీని విమర్శించే వారికి గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి ఇక్కడ పోటీ చేస్తే కనీసం మూడు వేల ఓట్లు కూడా రాలేదని విమర్శించారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, రణపంగ నాగయ్య, పాండునాయక్, కుంకు శ్రీనివాస్, రమేష్‌బాబు, కృష్ణమూర్తి, సత్యనారాయణరెడ్డి, ఆకారపు వెంకటేశ్వర్లు, సైదులు, జంగిలి వెంకటేశ్వర్లు, సూరిబాబు, ఇస్తియాక్, కోటేశ్వర్‌రావు, రవి, సతీష్, వినోద్, రవీందర్, శ్రీను, గోపాల కృష్ణ, వెంకటేశ్వర్లు, పుల్లయ్య తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని వినతి

కోదాడ : ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో మిల్లర్లు రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని, వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని అఖిల పక్షం నాయకులు కోరారు. ఈమేరకు బుధవారం కోదాడ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం ఆర్డీఓకు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మిల్లర్లు సిండికేట్‌గా మారి రూ. 2400 ధరను రూ.2 వేలకు తగ్గించారని ఆరోపించారు. దీనికి తోడు హమాలీ చార్జీల పేరుతో క్వింటాకు రూ. 17 వసూలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు బొల్లు ప్రసాద్, దొడ్డా వెంకటయ్య, బద్దం వెంకటరెడ్డి, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, గోపి, ఉదయగిరి, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

యువత చెడుకు దూరంగా ఉండాలి



గరిడేపల్లి : పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ చరమందరాజు

గరిడేపల్లి : ప్రజలు పోలీసులతో మమేకం కావడం కోసమే పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీఐ చరమందరాజు తెలిపారు. జిల్లా ఎస్పీ నర్సింహ ఆదేశాల మేరకు మండలంలోని పొనుగోడు గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం రాత్రి పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత చెడుకు దూరంగా ఉండాలన్నారు. పోలీసు రికార్డుల్లో ఒక్కసారి పేరు నమోదైతే ఉద్యోగాలు, పాస్పోర్ట్, వీసా రావని అన్నారు. మహిళలను వేధిస్తే శిక్ష తప్పదని అన్నారు. గ్రామానికి ఒక విలేజ్ పోలీస్ అధికారిని నియమిస్తున్నట్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని, చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని తెలిపారు. గంజాయి, మాదకద్రవ్యాలకు బానిసై జీవితాలను పాడు చేసుకోవద్దని యువతకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు చలిగంటి నరేష్, ముత్తయ్య, లక్ష్మీనరసయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

సోదరభావంతో మెలగాలి



మేళ్లచెరువు : పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో పాల్గొన్న సీఐ రజితారెడ్డి, ఎస్ఐ, ప్రజలు

మేళ్లచెరువు : గ్రామాల్లో ప్రజలు శాంతియుతంగా జీవించడంతో పాటు సోదరభావంతో మెలగాలని సీఐ రజితారెడ్డి సూచించారు. బుధవారం రాత్రి మేళ్లచెరువు మండలంలోని వేపలమాధవరం గ్రామంలో నిర్వహించిన పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రజలు గొడవలకు దూరంగా ఉండాలన్నారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ గ్రామాభివృద్ధికి కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐపరమేష్, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పథకం.. పేదలకు వరం



మునగాల : కలకోవలో సన్నబియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న ప్రత్యేక అధికారి రాజు

మునగాల : సన్నబియ్యం పథకం పేదలకు వరం అని కలకోవ గ్రామ ప్రత్యేక అధికారి బుంగ రాజు అన్నారు. బుధవారం కలకోవలో గల రేషన్ దుకాణంలో లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దొంగరి సైదులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పనస శంకర్, మండవ చంద్రయ్య, గంధం సైదులు, మండవ సత్యనారాయణ, చిర్ర శ్రీను, కొంపెల్లి వీరబాబు, గన్న నర్సింహారావు, దొంగరి అప్పారావు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం

పాలకవీడు : పేద ప్రజల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం అని మాజీ జెడ్పీటీసీ మాళోతు బుజ్జిమోతీలాల్ అన్నారు. బుధవారం బెట్టెతండ గ్రామంలో గల రేషన్ దుకాణంలో లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంపీఓ శ్రీనివాస్ మృతి బాధాకరం



ఎంపీఓ శ్రీనివాస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ, సిబ్బంది

మునగాల : మునగాల మండల పంచాయతీ అధికారి దార శ్రీనివాస్ (53) ఆకస్మిక మృతి బాధాకరమని ఎంపీడీఓ కె.రమేష్ దీనదయాళ్ అన్నారు. ఎంపీఓ దార శ్రీనివాస్ మూడురోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందారు. బుధవారం మునగాల ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎంపీడీఓ, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ.. శ్రీనివాస్ మండలంలో చేసిన సేవలను కొనియాడారు.

ఆర్టీసీ సేవలపై ప్రయాణికుల అభిప్రాయ సేకరణ



కోదాడ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులతో మాట్లాడుతున్న డీఎం

కోదాడ : ఆర్టీసీ సేవలపై ప్రయాణికుల నుంచి సంస్థ అభిప్రాయ సేకరణ మొదలు పెట్టింది. తాము అందిస్తున్న సేవలపై ఏమనుకుంటున్నారు..? ఇంకా ఏ రకమైన సేవలను ఆర్టీసీ నుంచి ఆశిస్తున్నారనే విషయాలపై అధికారులు ప్రయాణికుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం కోదాడ ఆర్టీసీ బస్టాండ్‌లో డిపో మేనేజర్ శ్రీనివాసరావు స్వయంగా ప్రయాణికులతో మాట్లాడి వారి అభిప్రాయాలు సేకరించారు. సెల్‌ఫోన్‌లో రూపొందించిన వివిధ రకాల ప్రశ్నలు ప్రయాణికులను అడిగి అభిప్రాయాలు సేకరించారు. క్షేత్రస్థాయిలో ప్రయాణికుల అభిప్రాయాలు సేకరించి వాటిని క్రోడీకరించి మెరుగైన సేవలందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ నాగశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి



కార్యక్రమంలో ఎస్ఐ, విద్యార్థులు, ఉపాధ్యాయులు

నడిగూడెం : భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని స్థానిక ఎస్ఐ జి.అజయ్‌కుమార్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సాయి ఈశ్వరి అన్నారు. ఉగాది, రంజాన్ పండుగలను పురస్కరించుకొని బుధవారం నడిగూడెం మండలంలోని మోడల్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కాగా, విద్యార్థులు, ఉపాధ్యాయులు తెలుగుతనం ఉట్టిపడేలా సంప్రదాయ దుస్తుల్లో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవించిన గర్భిణి



పుట్టిన బిడ్డను శ్రావణి కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న 108 సిబ్బంది

గరిడేపల్లి: పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రసవించింది. వివరాలు.. గరిడేపల్లి మండలం మర్రికుంట గ్రామానికి చెందిన శ్రావణికి బుధవారం ఉదయం పురిటినొప్పులు రావడంతో ఆమె భర్త సైదులు 108 వాహనానికి ఫోన్ చేశాడు. 108 సిబ్బంది హుటాహుటిన మర్రికుంటకు చేరుకొని శ్రావణిని వాహనంలో ఎక్కించి సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో పురిటినొప్పులు ఎక్కువ కావడంతో 108 సిబ్బంది డెలివరీ చేశారు. పుట్టిన పాపకి పల్స్ లేకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. వెంటనే 108 సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి పాపకి సీపీఆర్ చేయడంతో పల్స్ రావడంతో ఊపిరి పీల్చుకున్నారు. వెంటనే తల్లీబిడ్డలను సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు వెంటనే చికిత్స అందించారు. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. 108 సిబ్బంది నాగరాజు, పైలెట్ రషీద్‌ను శ్రావణి కుటుంబ సభ్యులతో పాటు పలువురు అభినందించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



నృత్య ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

కోదాడ : పట్టణ పరిధిలోని బాలికల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని బుధవారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు చేసి అలరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నిత్యావసర సరుకులు అందజేత

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో జమాతే ఇస్లామీ హింద్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు, నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

హుజూర్‌నగర్ : పట్టణంలోని మూడవ వార్డులో బుధవారం గుండెపోటుతో మృతి చెందిన ఉత్తర్ల యాదగిరి కుటుంబ సభ్యులను మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కోతి సంపత్ రెడ్డి పరామర్శించారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చిలుకూరు : చిలుకూరు గ్రామానికి చెందిన మంకెన లింగయ్య, మొక్క కోటయ్యకు ప్రభుత్వం నుంచి మంజురైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ చిలుకూరు మండల, కోదాడ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్‌లు బాల్‌రెడ్డి, యడవెల్లి పుల్లారావు అందజేశారు.

వృద్ధాశ్రమానికి బియ్యం అందజేత

మునగాల : మండల కేంద్రానికి చెందిన వాసవి క్లబ్ సభ్యుడు చెక్క కిషోర్ కుమారుడు వర్షిత్ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం మండల పరిధిలోని ముకుందాపురం వృద్ధాశ్రమానికి 25 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు అర్వపల్లి ప్రవీణ్, కోశాధికారి అఖిల్, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

హుజూర్‌నగర్ : రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చిత్రపటాలకు బుధవారం హుజూర్‌నగర్‌లో కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు మన్సూర్ అలీ, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.